క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సత్కారం

ఏలేశ్వరం: గురు పూజోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో గురువారం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల హైమావతి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో సుమారు 30 మంది ఉపాధ్యాయులకు స్వీట్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరమణ, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, కోరాడ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విలేకరి కుటుంబానికి ఆర్థిక సాయం


లింగంపర్తిలో సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విలేకరి సుంకర సత్యనారాయణ కుటుంబానికి ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి చేయూతను అందించారు. గురువారం లింగంపర్తిలో సత్యనారాయణ కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులను అన్నివిధాలా ఆదుకుంటామని ఎంపీపీ హామీ ఇచ్చారు. ఆయన వెంట హరిబాబు, తదితరులు ఉన్నారు.

ముగిసిన ఎల్ఐసీ వారోత్సవాలు

తుని: స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎల్ఐసీ ఆవిర్భావ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ లలిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బ్రాంచి మేనేజర్ జి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో ఎల్ఐసీ ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసినట్టు బీఎం సత్యనారాయణ తెలిపారు. యూనియన్ నాయకులు కేఎస్‌వీ సత్యనారాయణ, శోభన్‌కుమార్, వరప్రసాద్, బాల సుబ్రహ్మణ్యం, శర్మ, గంగాధర్, సాయిబాబా, రామ సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

జగపతి నగరంలో పారిశుద్ధ్య డ్రైవ్


డ్రైన్‌లో పూడిక తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కిర్లంపూడి: జగపతినగరం పంచాయతీ పరిధిలో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు డ్రైన్లు పూడుకుపోయాయి. దీంతో గ్రామ సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది డ్రైన్లలో పూడిక తీశారు. రోడ్లను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేశారు. పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సర్పంచ్ శ్రీలత సూచించారు.

చిన్నారి వైద్యానికి చేయూత


లీలా తల్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఒమ్మి రఘురాం, తదితరులు

జగ్గంపేట: మండలంలోని గుర్రపాలేనికి చెందిన చిన్నారి కంచుమర్తి లీలా శ్రీరాధా శివాత్మిక వెన్నుముక సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. తల్లిదండ్రులు పేదలు కావడంతో వైద్యం నిమిత్తం హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూపు సభ్యులు, పలువురు దాతలు రూ.రూ.104651 నగదును ఆర్థిక సహాయంగా సమకూర్చారు. కాగా గురువారం వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం ఆ సొమ్మును శివాత్మిక తల్లికి అందజేశారు.

ప్రత్తిపాడులో కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ


ప్రత్తిపాడులో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

ప్రత్తిపాడు: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్ర విజయవంతమైన సందర్భంగా ప్రత్తిపాడులో గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ర్యాలీని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ప్రారంభించారు. స్థానిక అంబేడ్కర్ కళామందిర్ వరకు ర్యాలీ కొనసాగింది. తొలుత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి సత్తిబాబు, ఈరుగుల చక్రం, కందిమళ్ల సామ్యేలు తదితరులు పాల్గొన్నారు.

అప్రోచ్ నిల్.. ప్రమాదాలు ఫుల్

- హైవేపై ముఖ్య కూడళ్లలో అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణం
- అప్రోచ్ రోడ్లు నిర్మించని కాంట్రాక్టర్లు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు


అప్రోచ్ రోడ్లు లేక నేరుగా హైవేపైకి దూసుకు వెళుతున్న వాహనాలు

తుని రూరల్: పదహారో నంబరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించారు. కాగా ఈ బ్రిడ్జిలను అనుసంధానం చేస్తూ అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడంతో తురచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు వచ్చి హడావిడి చేస్తున్నారే తప్పా అప్రోచ్ రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించడం లేదు.

రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లలో..

జాతీయ రహదారిని 2002లో నాలుగు లైన్ల రహదారిగా విస్తరించారు. గ్రామీణ ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు అనువుగా నిత్యం రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లలో అండర్‌పాస్ బ్రిడ్జిలు, అప్రోచ్ రోడ్లు నిర్మించేందుకు ప్రతిపాదించారు. ఇలా తుని మండలంలో జగన్నాథగిరి, వెలంపేట కాలనీ, చేపూరు (గవరయ్య కోనేరు), ఎర్రకోనేరు, తేటగుంట, అన్నవరం వై-జంక్షన్ల అండర్‌పాస్‌లు నిర్మించాలని ప్రతిపాదించారు. కాంట్రాక్టర్లు చేపూరు, ఎర్రకోనేరు, అన్నవరం వై-జంక్షన్ సమీపంలో అండర్‌పాస్‌లు నిర్మించినా, పెట్టుబడి తగ్గించుకునేందుకు గాను నేటికి అప్రోచ్ రోడ్లు నిర్మించ లేదు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు నేరుగా జాతీయ రహదారిపైకి వస్తున్నారు. అదే సమయంలో భారీవాహనాలు, కార్లు వేగంగా దూసుకువెళ్తుండడంతో హైవేపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతుండగా వందలాది మంది క్షతగాత్రులవుతున్నారు.

ప్రమాదాలకు నిలయంగా..

జగన్నాథగిరి, వెలంపేట కాలనీ, చేపూరు, ఎర్రకోనేరు, తేటగుంట జంక్షన్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. తుని మండలం తాళ్లూరు, లోవకొత్తూరు, కొత్త వెలంపేట, సీతయ్యపేట, రౌతులపూడి మండలం డీజే పురం తదితర గ్రామాలకు జగన్నథగిరి జంక్షన్ నుంచి జాతీయ రహదారిని దాటుకుని వాహనాలు, ప్రయాణికులు వెళ్లాల్సి ఉంది. ముఖ్యంగా తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానికి వెళ్లే ప్రధాన రహదారి ఇదే. దీంతో నిత్యం వేలాది మంది భక్తులు, ప్రయాణికులు ఈ


చేపూరు వద్ద నిరుపయోగంగా ఉన్న అండర్ పాస్ బ్రిడ్జి

మార్గంలోనే వెళుతున్నారు. కనురెప్పపాటులో హైవేపై దూసుకువస్తున్న వాహనాలు ఢీకొని పలువురు ప్రాణాలను వీడుతున్నారు. జగన్నాథగిరి, తేటగుంట, వెలంపేట కాలనీల వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిలు నిర్మిస్తే ఎంతో ప్రయోజనంగా ఉంటుంది.

నిరుపయోగంగా...

చేపూరు, ఎర్రకోనేరు జంక్షన్లలో ఇప్పటికే నిర్మించిన అండర్‌పాస్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ అండర్‌పాస్‌లకు అనుసంధానంగా అప్రోచ్ రోడ్లను నిర్మిస్తే ప్రమాదాలు తగ్గుతాయి. జాతీయ రహదారిని ఆరు లైన్లగా విస్తరిస్తున్నప్పుడైన ఆయా జంక్షన్లలో ప్రమాదాలు నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

> **భూసేకరణ పూర్తయినా..**
>
> ఎర్రకోనేరు వద్ద నిర్మించిన అండర్‌పాస్‌కు భూసేకరణ పూర్తయినా అప్రోచ్ రోడ్డు నిర్మించ లేదు. ఇటుగా టి.వెంకటాపురం, హెచ్.కొత్తూరు, హంసవరం, తొండంగి మండలంలో పలు గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఎంతో మంది చనిపోతున్నారు. గాయపడుతున్నారు.
>
> – పోతుల పెదకాపు, టి.వెంకటాపురం
>
> **అప్రోచ్ రోడ్లు నిర్మించాలి**
>
> అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించారు. అప్రోచ్ రోడ్లను నిర్మించాలి. చేపూరు జంక్షన్ ప్రయాణికులు, వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు, వాహనాలు నేరుగా జాతీయ రహదారిపైకి ఎక్కుతున్నారు. అదే సమయంలో హైవేపై భారీవాహనాలు వేగంగా వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు నివారించాలి.
>
> – గింజాల స్వామి, రాజుపేట

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి


కొత్తచోడిపల్లిపేటలో మంత్రి దాడిశెట్టి రాజాకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

తొండంగి: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కొత్తచోడిపల్లిపేటలో రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖమంత్రి దాడిశెట్టి రాజాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న తమకు జీతాలు పెంచాలని, గ్రాట్యూటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ తుని రూరల్ ప్రాజెక్ట్ లీడర్ బి.మేరీ సమాధానం, అంగన్‌వాడీ వర్కర్లు వరలక్ష్మి, ప్రేమావతి, భవాని, గంగాభవాని, సూరితల్లి, నాగమణి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇంటికే పథకాలు


కొత్తచోడిపల్లిపేటలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- కొత్తచోడిపల్లిపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

తొండంగి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. పెరుమాళ్లపురం పంచాయతీ మత్స్యకార గ్రామం కొత్తచోడిపల్లిపేటలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిగి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పేదరికంతో ఇబ్బంది పడుతున్న పలు కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రతి ఒక్కరూ సంక్షేమ పాలనకు మరో మారు పట్టంకట్టాలని కోరారు. కార్యక్రమంలో తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ పసపులేటి సతీష్, వైస్ ఎంపీపీ-2 యాదాల రమణ, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గాబు రాజు, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, వైఎస్సార్ సీపీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, పార్టీ నాయకుడు గంగిరి అడివియ్య తదితరులు పాల్గొన్నారు.

జి.కొత్తపల్లిలో 104 వైద్య సేవలు


జి.కొత్తపల్లిలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సౌమ్యశ్రీ

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో గురువారం 104 వాహనం ద్వారా రోగులకు వైద్య సేవలు అందించినట్టు పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యురాలు సౌమ్యశ్రీ తెలిపారు. రోగులు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. కౌమార దశలో ఉన్న యువతులకు రక్తహీనత ఉంటే పోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలకు వెళ్లి చిన్నారులను పరీక్షించారు. ప్రస్తుతం వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 60 మంది సాధారణ రోగులు, 10 మంది గర్భిణులు, ఇద్దరు బాలింతలు, 50 మంది మధుమేహ బాధితులు, 60 మంది రక్తపోటుతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించినట్టు డాక్టర్ సౌమ్యశ్రీ తెలిపారు.

ఉద్యోగులకు సేవలే గుర్తింపు


ప్రత్తిపాడులో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ధనలక్ష్మిని సత్కరిస్తున్న జెడ్పీటీసీ, నాయకులు

ప్రత్తిపాడు: ఉద్యోగులకు సేవలే గుర్తింపును ఇస్తాయని, అవార్డులు బాధ్యతను మరింత పెంచుతాయని జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి అన్నారు. ప్రత్తిపాడు ఆర్‌సీఎం పాఠశాల ఆవరణలో గురువారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాజాన ధనలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ధనలక్ష్మి విశేష కృషి చేశారన్నారు. ఆనాథ, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు విద్యనందించడంతో ఆమె చొరవ మరువరానిదని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయిని ధనలక్ష్మిని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, ఉప సర్పంచ్ మదినే నూకరాజు, వార్డు సభ్యుడు తాతపూడి బుజ్జి, విశ్రాంత ఏఎస్సై ఎం.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపైనే మురుగు నీరు


తాళ్లూరులో రోడ్డుపై నిలిచిన మురుగు నుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు కృష్ణాలయం వెనుక యాదవ సంఘం వీధిలో మురుగు నీరు రోడ్డుపై నిలిచిపోయింది. వర్షం నీరు, ఇళ్లల్లోని వాడకపు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో ఇంటి నుంచి కాలు బయట పెట్టలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ మురుగు నీటి లోంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీనిపై పంచాయతీ పాలకవర్గం, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై స్పందనలో ఫిర్యాదు చేశామని, అధికారులు వచ్చి చూసి వెళ్లారు తప్ప సమస్యను పరిష్కరించలేదన్నారు. మురుగు నీటిలోంచి రాకపోకలు సాగిస్తుంటే దురదలు, ఇతర చర్మవ్యాధులు వ్యాపిస్తున్నాయని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి పోతుల వీరశిరీష్‌ను వివరణ కోరగా గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సుబ్బలక్ష్మితో కలిసి మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశాన్ని పరిశీలించామని తెలిపారు. త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

బీఎల్‌ఓలకు శిక్షణ



బీఎల్‌ఓల శిక్షణలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుబ్బలక్ష్మి

రౌతులపూడి: ఓటర్ల జాబితా పారదర్శకంగా, పక్కాగా ఉండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుబ్బలక్ష్మి అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ భీమారావు ఆధ్వర్యంలో గురువారం బీఎల్వోలకు ఓటర్ల జాబితా సవరణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన ఓటర్ సర్వేపై సమగ్ర జాబితాలను అందివ్వాలని సూచించారు. సర్వేలో వచ్చిన అప్పీలను పరిశీలించి సంక్షిప్త సవరణ చేపట్టాలన్నారు. మరణాలు, చేర్పులు, మార్పులపై సమగ్ర నివేదిక అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పీవీవీ సత్యనారాయణ, బీఎల్వోలు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రను విజయవంతం చేయాలి


ప్రత్తిపాడులో విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రత్తిపాడు: విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ కాకినాడ జిల్లాలో ఈ నెల 8 నుంచి చేపట్టనున్న విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్రను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కన్వీనర్ చవాకుల నరసింహమూర్తి కోరారు. స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం సాయంత్రం ఎస్ఎఫ్ఐ మండలశాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తునిలో సైకిల్ యాత్ర ప్రారంభమై అన్నవరం, కత్తిపూడి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, జగ్గంపేట, పెద్దాపురం, సామర్లకోట మీదుగా 14న కాకినాడలో సైకిల్ ర్యాలీ ముగుస్తుందని చెప్పారు. అనంతరం విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర పోస్టర్‌ను ప్రగతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.రమేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్, డి.సుబ్బరాజు, బి.చంటి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు


అల్లిపూడిలో లబ్ధిదారులకు కొత్త పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు అందిస్తోందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు తెలిపారు. అల్లిపూడిలో లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివక్షతకు తావు లేకుండా అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఏఎబీ రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, మండల చైర్మన్ సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, నాయకులు గర్సింగు దొరబాబు, కుంచే అచ్చిరాజు, మల్లంపల్లి ప్రకాష్ పాల్గొన్నారు.

వైభవంగా గుబ్బాలమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో గుబ్బాలమ్మ అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో పైడిమల్లమ్మ అమ్మవారు

కిర్లంపూడి: రామకృష్ణాపురంలో గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయం పునఃనిర్మాణాన్ని పురస్కరించుకుని గురువారం అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక, పరసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా పైడిమల్లమ్మ జాతర

ఏలేశ్వరం: ఏలేశ్వరం గ్రామ దేవత పైడిమల్లమ్మ అమ్మవారి జాతర గురువారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జాతరలో స్థానిక కళాకారులతో గరగల నృత్యం, తాడేపల్లిగూడెం వారితో నవశక్తి వేషాలు, బిక్కవోలు వారితో బాణసంచా కాల్పులు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆలయ పూజారి అగ్నిగుండం తొక్కుతారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

కృష్ణా.. ముకుందా

- కన్నులపండువగా జన్మాష్టమి వేడుకలు
- వేషధారణలతో అలరించిన చిన్నారులు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉట్టిని కొట్టేందుకు యువత పోటీ పడ్డారు.


లింగంపర్తిలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

తుని: స్థానిక బ్యాంకు కాలనీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉట్టి కొట్టె కార్యక్రమం నిర్వహించారు. ఉట్టిని కొట్టేందుకు విద్యార్థులు పోటీ పడ్డారు. పాఠశాల హెచ్ఎం ఇసరపు స్వామి, ఉత్సవ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లింగంపర్తిలో..

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. త్రైతి సిద్ధాంత ఆదికర్త, శతాధిక గ్రంథకర్త ఆచార్య ప్రబోధనందా యోగీశ్వరుల అశీస్సులతో రాజమహేంద్రవరానికి చెందిన జ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీకృష్ణుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహక కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కిల్లి శేఖర్, దవులూరి సత్యనారాయణ, కమిటీ సభ్యులు కీలు సత్యనారాయణ, కీలు అన్నవరం, శాంతి, దేవి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి

గోకవరం: మండల వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గోకవరం వెలమపేటలోని గీతా మందిరంలో సనాతన ధర్మ ప్రబోధన స్వచ్ఛంద సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్టి కొట్టే ఉత్సవం, చిన్నారులకు వేషధారణల పోటీలు నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు. అలాగే పెంటపల్లి, కామరాజుపేట, తంటికొండ, మల్లవరం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ప్రత్తిపాడు: కృష్ణాష్టమిని పురస్కరించుకుని గురువారం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నండూరి రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మహిళా భక్తబృందం విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ, మహాలక్ష్మి అష్టోత్తర పారాయణ గావించారు. మండలంలోని ఏలూరులో కృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టికొట్టే సంబరం నిర్వహించారు.

కిర్లంపూడి: మండలంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమరాజుపేట రామాలయంలో ఏకాహం, చిల్లంగి, రాజుపాలెం శ్రీకృష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దాడి చినబుజ్జి, యాదవ సంఘం అధ్యక్షులు నైదాన రఘు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.


తునిలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులు


గోకవరంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరిస్తున్న చిన్నారులు


ఏలూరులో ఉట్టి కొట్టు ఉత్సవం